ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా?


జాజిరేణికుంట చెరువుకట్టపై ప్రమాదకరంగా బావులు


రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న వేలేరు మద్దెలవాగు కల్వర్టు

- శిథిలావస్థకు చేరిన కల్వర్టులు
- రక్షణ గోడలు లేని వ్యవసాయ బావులు
- గతంలో ప్రమాదాలు జరిగినా పట్టింపులేని అధికారులు
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల పక్కనే ఉన్న వ్యవసాయ బావులు, కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆయా రోడ్ల వెంట నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచి ప్రయాణించినా ప్రమాదాలు తప్పవని, రాత్రివేళల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని భయాందోళన చెందుతున్నారు. పీచర అంబేడ్కర్ సెంటర్ నుంచి లోక్యాతండాకు వెళ్లే దారిలో జంగంకుంట చెరువు కట్ట ప్రమాదకరంగా ఉంది. అదే దారిలో వ్యవసాయ బావులు కూడా రోడ్డు పక్కనే రక్షణ గోడలు లేకుండా ఉండడంతో అటువైపు వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. అలాగే చింతలతండా నుంచి ఎర్రబెల్లికి వెళ్లే జాజిరేణికుంట చెరువుకట్టపై ఇరువైపులా నాలుగైదు బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. మల్లికుదుర్ల నుంచి కుమ్మరిగూడెం వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టు కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించగా అది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఆదారి గుండా నిత్యం పాఠశాలలకు వెళ్లే బస్సులు, వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సింగిల్ రోడ్డు కావడం కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పితే నేరుగా వాగులో పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మిరుపకుంట తండా నుంచి లోక్యాతండా వెళ్లే చెరువుకట్ట ఐదారు మీటర్ల లోతులో ప్రమాదకరంగా ఉంది. వేలేరు నుంచి కమ్మరిపేటకు వెళ్లే రోడ్డులో మద్దెలవాగుపై కల్వర్టు ప్రమాదకరంగా మారింది. పీచర నుంచి మల్కాపూర్‌కు వెళ్లే దారిలో మంచినీళ్ల వాగుపై లోలెవల్ కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో గతంలో పలు వాహనాలు అదుపుతప్పి కల్వర్టులో పడి ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకంగా ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావులకు, కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పాలకులు సైతం పట్టించుకోవాలన్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి



మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల వెంట ప్రమాదకరంగా ఉన్న బావులకు రక్షణ గోడలు నిర్మించాలి. చింతల తండా నుంచి ఎర్రబెల్లి గ్రామానికి వచ్చే జాజిరేణికుంట చెరువుకట్టకిరువైపులా వ్యవసాయ బావులు ప్రమాదాలకు తావిస్తున్నాయి. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ప్రమాదాలు జరగకముందే స్పందించాలి.

-ఎండీ.షేక్‌అలీ, ఎర్రబెల్లి గ్రామస్తుడు

కల్వర్టులు కట్టాలి



మండలంలోని మల్లికుదుర్ల నుంచి కుమ్మరిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. అలాగే వేలేరు నుంచి కమ్మరిపేటకు వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న కల్వర్టుకిరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఆదారి గుండా వెళ్లాలంటే భయమేస్తుంది. అధికారులు స్పందించి కల్వర్టుకిరువైపులా రక్షణ గోడలు నిర్మించాలి.

- నాగరాజు, కమ్మరిపేట గ్రామస్తుడు

క్లుప్తంగా

కేసు నమోదు

ఆత్మకూరు : తనకు గతంలో విక్రయించిన భూమిని తనకు తెలియకుండా వేరేవారికి విక్రయించారని మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన సావడి అప్పారావు శనివారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొత్తగట్టు శివారులోని 21గుంటల భూమిని మామిడిపల్లి సారికొమురయ్య వద్ద 2019లో కొనుగోలు చేశానని అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నానని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయమంటే పాస్‌బుక్ బ్యాంక్‌లో ఉందని దాటవేసి ఇటీవల అదే భూమిని రేణుకుంట్ల వేణుప్రసాద్ కొనుగోలు చేసి తిరిగి చిట్టిరెడ్డి లక్ష్మికి విక్రయించాడని వారిపై చర్యలు తీసుకోవాలని అప్పారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన విజయ్‌చందర్ రెడ్డి



దామెర : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన రాంచందర్ రావును ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సురేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ధర్మసాగర్ మండలానికి చెందిన కంది రమేశ్ ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో పేకాడుతున్న పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పీచర గ్రామంలో పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా కొంతమంది వ్యక్తులు పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పీచర గ్రామానికి చెందిన ఆలూరి జైహింద్, రామంచ అరుణ్, ఏలూరి సుధాకర్, గంగారపు శంకర్, గంగారపు శశికుమార్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 5వేల నగదు, 2 సెల్ ఫోన్లు, పేకాటముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖాళీ ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచాలి

పరకాల : ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా ఖాళీ ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచని పక్షంలో మున్సిపల్ చట్టం ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని మున్సిపల్ కమిషనర్ సుష్మ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గుంతలు ఉన్న ప్లాట్లలో మొరం నింపి, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. ఖాళీ ప్లాట్ల కారణంగా చెత్తాచెదారం, వర్షాకాలం నీళ్లు నిలిచిపోయి దోమలు వ్యాపిస్తాయని తెలిపారు.

మంత్రి పరామర్శ

ఎల్కతుర్తి : మండలంలోని సూరారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రవి ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అధికారుల పరామర్శ..

నడికూడ : మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి నాగెల్లి శ్యామ్ సుందర్‌రెడ్డి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో చెందారు. ఎంపీడీఓ గజ్జెల విమల, ఎంపీఓ రవి, ఏపీఓ విద్యావతి, సీనియర్ అసిస్టెంట్ సరోజున, నవీన్ కుమార్, సాగర్, కుసుమ, మండల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఎల్కతుర్తి : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు పురుగలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భీమదేవరపల్లి మండలం విశ్వనాథకాలనీలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథకాలనీకి చెందిన వల్లెపు కొమురయ్య(59) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా రెండు సంవత్సరాల క్రితం గుండెనొప్పి రావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం కొమురయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 4న రాత్రి సమయంలో పొలానికి వెళ్లి ఇంటికి రాలేదు. శనివారం వ్యవసాయ బావి వద్దకు వెళ్ళిన ఓ రైతు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు చూడగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్ర పూజలు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో గల స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీ నృసింహుడికి స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తైన అనంతరం ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తూ విశేషంగా అభిషేకం జరిపించారు. అదే విధంగా అర్చకులు సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. ఆచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

కమలాపూర్ : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసుకోవాలని హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కమలాపూర్‌లో ఇళ్లు మంజూరైన పలువురు లబ్ధిదారుల ఇళ్లకు శనివారం ఆయన ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శివకృష్ణగౌడ్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి నవీన్, కార్యదర్శి శ్రీనివాస్, కన్నూరు సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ చైర్మన్ సురేష్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన కాంగ్రెస్ నాయకులు

ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దామెర : తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌లాల్ షట్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వంట మనుషి-1, దోబి-1, స్వీపర్-1, ఎలక్ట్రీషన్-1 పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగి అభ్యర్థులు దరఖాస్తులతో పాటు బయోడేటాను సమర్పించాలని కోరారు. ఆధార్ జిరాక్స్, రెండు ఫొటోలతో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒగ్లాపూర్ సమీపంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో సమర్పించాలని సూచించారు. ఎలక్ట్రీషన్ పోస్టుకు ప్లంబింగ్ నైపుణ్యం కూడా ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9949300868, 9573969991, 7780167736, 7995057981 నంబర్లకు సంప్రది

టీయూఎఫ్ మండల యూత్ అధ్యక్షుడిగా నాగరాజు

శాయంపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల యూత్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ముంజాల నాగరాజును నియమించినట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గణేశ్ శనివారం ప్రకటించారు.

సహకార సంఘాలతో సమాజాభివృద్ధి


ఐనవోలు : మొక్క నాటుతున్న టీజీ క్యాబ్ చైర్మన్ రవీందర్‌రావు


పరకాల : మొక్క నాటుతున్న లింగమూర్తి


ధర్మసాగర్ : మొక్కలు నాటుతున్న సిబ్బంది

- టీజీ క్యాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు : సహకార సంఘాలతో సమాజం అభివృద్ధి చెందుతుందని టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని డీసీసీబీ ఐనవోలు బ్రాంచ్ వద్ద మొక్క నాటి అంతర్జాతీయ సహకార వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి, తెలంగాణ ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వేడుకల్లో నాబార్డు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొని సహకార సంస్థలపై అవగాహన పెంచడం, ఆర్థిక సామర్థ్యం, సమానత్వం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రుణ సరఫరా, మార్కెటింగ్, డైరీ, హౌసింగ్ వంటి అనేక రంగాల్లో సహకార సంస్థలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. తెలంగాణలో మహిళ సహకార సంఘాలు, స్వయం సహాయక సమూహాలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నట్లు వివరించారు. యువతకు సహకార రంగంలో పెద్దెత్తున ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. డీసీఓ సంజీవరెడ్డి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంఏఓ సునీల్‌కుమార్, నందనం సొసైటీ డైరక్టర్లు బుచ్చిరెడ్డి, పద్మ, చిరంజీవి, కుమార్, బాబు, సీఈఓ సంపత్, బ్యాంకు మేనేజర్ శ్రావణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : సహకార సంఘం అభివృద్ధికి ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ధర్మసాగర్ బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ సుష్మారెడ్డి కోరారు. సహకార వేడుకలను పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. క్యాషియర్ శైలజారెడ్డి, సూపర్‌వైజర్ జమ్ముల శ్రీనివాస్రెడ్డి, మేసింబర్ విశాల్, సెక్యూరిటీ సుధాకర్, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమారస్వామి, పాలకవర్గ సభ్యులు లెనిన్, విజయ, రాజయ్య, వీరయ్య, సెక్రటరీ రాజిరెడ్డి, సిబ్బంది కుమారస్వామి, ప్రభుదేవ్, మురళీకృష్ణ, ప్రవీణ్‌కుమార్, రాజేందర్, వివేక్ పాల్గొన్నారు.

పరకాల : అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని డీసీసీబీ బ్యాంక్ ఆవరణలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా మాదారం పీఏసీసీ చైర్మన్ లింగమూర్తి హాజరయ్యారు. సహకార సంస్థల ద్వారా యువతకు ఉపాధి శిక్షణ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. డీసీసీబీ పరకాల బ్రాంచి ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, అసిస్టెంట్ మేనేజర్ ప్రతిభ, డైరెక్టర్లు ఉన్నారు.

ఇఫ్కో కంపెనీ పురుగుమందుల సీజ్

శాయంపేట : మండల కేంద్రంలోని భాస్కర ఫెర్టిలైజర్స్ డిపోను శనివారం ఎస్సై జక్కుల పరమేష్, ఏఓ గంగాజమున ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇఫ్కో కంపెనీకి చెందిన నానో డీఏపీ, నానో యూరియా, పురుగు మందులను గుర్తించి ఇన్వాయిస్ (బిల్లు) లేకపోవడంతో నానో డీఏపీ అర లీటర్ 60 బాటిళ్లు, నానో యూరియా అర లీటర్ 5 బాటిళ్లను సీజ్ చేశారు. గతంలో బిల్లు లేకుండా నానో యూరియాను రైతులకు అమ్మకాలు జరిపారని, ఎరువుల షాపులో ఉన్న స్టాక్ వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయకపోవడం, ఎరువుల షాపు ముందు ఎరువులకు ధరల పట్టిక బోర్డు ప్రదర్శించకపోవడంతో ఆమె ఆగ్రహించారు. ఇన్వాయిస్ లేని పురుగుమందులను సీజ్ చేసి కేసు నమోదు చేసి అదనపు కలెక్టర్ కోర్టులో సమర్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.


పురుగుమందులను సీజ్ చేసిన అధికారులు

గ్రామ సభల షెడ్యూల్ విడుదల

దామెర : జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సబంధించి 5వ విడత సామాజిక తనిఖీ బృందం గ్రామల్లో పర్యటించి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్పన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న ఉదయం 8.30 గంటలకు కోగిల్వాయి, 9 గంటలకు ల్యాదెళ్ల, 9.30కు దమ్మన్నపేట్, 10కు ముస్త్యాలపల్లి, పసరగొండ, 10.30కు దుర్గంపేట్‌లో గ్రామ సభలు ఉంటాయని పేర్కొన్నారు. 11న ఉదయం 8.30 గంటలకు వెంకటపూర్, 9 గంటలకు ఊరుగొండ, పులుకుర్తి, 9.30 గంటలకు సింగరాజుపల్లి, ఒగ్లాపూర్, 10 గంటలకు సీతారాంపూర్‌లో గ్రామ సభలు ఉంటాయని పేర్కొన్నారు. ఈనెల 13న ఉదయం 9 గంటలకు దామెర మండల కేంద్రంలో, 10 గంటలకు తక్కళ్లపహాడ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు


లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

శాయంపేట : సీఎం సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23మంది లబ్ధిదారులకు రూ. 6లక్షల 84వేల 500 విలువచేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని అన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మానవతాదృక్పథంతో సీఎం రేవంత్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సీఎం సహాయ నిధి మంజురు చేస్తున్నారని కొనియాడారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలను వినియోగించుకోవాలి

- ఎంపీడీఓ గుండె బాబు


దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు

కమలాపూర్ : మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. ఈ జాబ్ మేళాలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని డీడీయూజీకేవై శిక్షణ కేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి, యూనిఫాం, బుక్స్, రూ.3 వేల భృతితో పాటు బీమా అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సర్టిఫికెట్లు అందించి ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ జాబ్ మేళాలో మండలంలోని 60 మంది నిరుద్యోగులు ఉచిత శిక్షణ, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోని నిరుద్యోగ యువతీ, యువకులు సోమవారం నేరుగా వరంగల్‌లోని శిక్షణ కేంద్రానికి వెళ్లాలని, వివరాలకు 9959915187 నంబరును సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీయూజీకేవై ప్రాజెక్ట్ మేనేజర్ రమేశ్, నిరుద్యోగులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్


మాట్లాడుతున్న రమేశ్

ఎల్కతుర్తి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు వత్తాసు పలుకుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల ప్రాణాలకు యమపాశాలుగా మారాయని, కార్మిక చట్టాలను సులభతరం చేయడం వలనే సంగారెడ్డి జిల్లాలోని సిగాచి పరిశ్రమలో 36 మంది కార్మికులు అగ్నికి ఆహుతయ్యారని అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశం శనిగరం రాజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాగుల రమేశ్ హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల లాభాల కోసం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నీరుగార్చి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, సరియైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లనే సంగారెడ్డి జిల్లాలోని ప్రమాదం సంభవించిందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ జులై 9న సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఐటీయూ మండల నాయకులు అంబాల రాజు, సమ్మయ్య, షణ్ముఖం, మల్లయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- సీఐ రంజిత్‌రావు


మాందారిపేట స్టేజీ వద్ద డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ రంజిత్ రావు హెచ్చరించారు. మండలంలోని మాందారిపేట స్టేజీ వద్ద ఎస్సై జక్కుల పరమేశ్‌తో కలిసి వాహనాలను తనిఖీ చేసి బ్రీత్‌ఎలైజర్‌తో డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రంజిత్‌రావు మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనాదారులు సీట్‌బెల్ట్ ధరించి నడుపాలని సూచించారు. వాహనానికి సంబంధించిన కాగితాలను తప్పకుండా తమ దగ్గరుంచుకోవాలని తెలిపారు. వర్షాకాలం కారణంగా రోడ్డుపై నీళ్లు నిలుస్తాయని, ద్విచక్ర వాహనదారులు వేగంగా వెళ్తే స్కిడ్ అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. వాహనాలను వేగంగా నడుపొద్దని అన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

కమలాపూర్ : మహిళల కోసం అమలు చేస్తున్న చట్టాలపై ప్రతీ ఒక్క మహిళ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి రక్షణ పొందేందుకు సఖి సెంటర్ 24గంటలు అందుబాటులో ఉంటుందని అన్నారు. సమస్య ఉన్నప్పుడు ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు కాల్ చేస్తే తక్షణ సాయం, రక్షణ లభిస్తుందన్నారు. అదే విధంగా 0870 2452112, 7382983088 నంబర్లకు కాల్ చేస్తే బాధిత మహిళలకు సాయం అందిస్తారన్నారు. సఖి కేస్ వర్కర్ భారతి, సీసీలు మమత, వనిత, సుజాత పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని మోడల్ స్కూల్ విద్యార్థిని దొండ అక్షయ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ముల్కనూరు గ్రామానికి చెందిన అక్షయ.. పదో తరగతిలో మండలంలోనే అత్యధికంగా 556 మార్కులు సాధించి మహబూబ్‌నగర్ క్యాంపస్‌లో సీటు సాధించింది. మండలంలో టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై శనివారం ఎంఈఓ సునీతారాణి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెహమాన్ ఉపాధ్యాయ బృందంతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


అక్షయ